www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 17 జులై 2024

5

వైఎస్ఆర్



నేడు మానసవీణ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జీవీఎల్ లావణ్య రచించిన (మానసవీణ మనోగతరాగాలు) అనే కవితా సంపుటిని ఈనెల 17 సాయంత్రం 5.30 గంటలకు కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, సభ నిర్వాహకులు ఆచార్యమూల మల్లి కార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభాధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, ముఖ్య అతిథిగా జమ్మలమడుగు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు సి. నారాయణ రెడ్డి, పుస్తక సమీక్ష చేయ డానికి రాజంపేట ఎక్స్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరిగొప్పుల లక్ష్మీనా రాయణ, ఆత్మీయ అతిథులుగా సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచా లకులు ఆచార్య తప్పెట రామ ప్రసాద్ రెడ్డి, మానస సంస్థల అధినేత కె చిన్నపరెడ్డి, వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బి.గంగాధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు,రచయితలు ,సాహితీ మిత్రులు హాజరుకావాలని తెలిపారు.

సా..గుతున్న ఖరీఫ్!

- పదును కోసం ఎదురుచూపు
- కడపలో 11 శాతంలోనే విత్తనం
- అన్నమయ్యలో సాగు 15 శాతం

ఖరీఫ్ సీజన్ ఆశావహంగా ముందుకు సాగడం లేదు. జూన్ ప్రారంభంలో మంచి వర్షాలతో ఆశలు రేకెత్తించింది. అదే నెల నాలుగో వారం నుంచి వర్షపాతం మందగించడంతో సాగు ఆశించిన రీతిలో సాగలేదు. జిల్లా రైతాంగం మంచి పదును కోసం ఆకాశం వైపు ఆశతో నిరీక్షిస్తోంది. ప్రతిరోజూ సాయంత్రానికి ఆకాశం కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, చివరి ఉస్సూరుమనిపించడం పరిపాటిగా మారింది. కడప జిల్లాలో 11.78 శాతం, అన్నమయ్యలో 15.10 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. జులై నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో విత్తనం పడాల్సిన తరుణంలో మేఘం ఊరించి ఉస్సూరుమనిపిస్తుండడం రైతుల్లో ఆందోళన నెలకొంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ నత్తనడకన సాగుతోంది. కడప జిల్లాలో1,85,716 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,61,612 ఎకరాల విస్తీర్ణంలో పం టలను సాగు చేయాలనేది ఉమ్మడి వ్యవ సాయ శాఖల లక్ష్యం. కడప జిల్లాలో జూన్ మాసం నుంచి 21,978 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 24,403 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 11.78 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 15.10 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లాల్లో మిగిలిన పొలమంతా బీడుగా దర్శన మిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జిల్లాల రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. పొలంలో విత్తనం విత్తడానికి అన్ని విధాలుగా సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేయడం నిరుత్సాహాన్ని కలిగించింది. కడప జిల్లాలో ప్రధాన పంట వరి పంట 76,992 ఎకరాలకు గానూ 2,670 ఎకరాలు, వేరుశనగ పంట 14,748 ఎకరాల్లో సాగు కు గానూ 3047 ఎకరాలు, పత్తి 66, 902 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 7,773 ఎకరాలో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 1.61612 ఎకరాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు 24,403 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈ లెక్కన జిల్లాలో 15.10 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన పంట వేరుశనగ. జిల్లాలో 1,05,844 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 19,283 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 18.22 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన పొలమతా బీళ్లుగానే దర్శనమిస్తోంది.

జులైలో వర్షాభావం వెంటాడింది. 96.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 24 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు కొనసాగుతోంది. ఫలితంగా కడప జిల్లాలో ఖరీఫ్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 36 మండలాలు ఉన్నాయి. ఇందులో ఒక నెలలో కురవాల్సిన వర్షపాతాన్ని, రెండు, మూడు రోజుల్లో కురవడం తరువాత ముఖం చాటేయడంతో దుక్కులు చదును చేసుకో వడానికి సరిపోతోంది. విత్తనం వేయడానికి మరో పదునుపాటు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఫలితంగా పంటల సాగు నత్తక నడకన సాగుతోంది. అన్నమయ్య జిల్లాలో 30 మం డలాలున్నాయి. ఇందులో తొమ్మిది మండ లాలు సర్‌ప్లస్ వర్షపాతం కలిగి ఉండడం, 11 మండలాలు సాధారణ వర్ష పాతాన్ని కలిగి ఉండడం, 10 మండలాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. రైల్వే కోడూరు, మదనపల్లి ప్రాంతాలు మినహా యిస్తే మిగిలిన మండలాలన్నీ మెట్ట ప్రాంతాలు కావడంతో వేరుశనగ సాగుకు అనుకూల వాతా వరణం ఏర్పడింది. వేరుశనగ సాగు ఆశాజనకంగా సాగు కావడం గమనార్హం. అన్నమయ్య జిల్లా భిన్నమైన బౌగోళిక వాతావరణ పరిస్థితులను కలిగిన నేపథ్యంలో వేరుశనగ ఆశావహంగా సాగినట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో కురిసిన అరకొర వర్షానికి వేరుశనగ సాగుకు అనుకూలించడంతో అంతంత మాత్రమే పంటల సాగు విస్తీర్ణం కనిపిస్తోందని చెప్పవచ్చు.

కదిరి ప్రభాకర్‌కు న్యాయం చేయకపోతే

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం

- ముందు బాధితుడికి ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చి భరోసానివ్వండి
- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప



బాధితుడిని పరామర్శిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు నల్లప్ప, ఆనందబాబు

ప్రజాశక్తి-కడప అర్బన్

సలసల కాగే నూనెను దళితుడి ఒంటిపై పోసి రాష్ట్రాన్నే ఉలిక్కిపడేలా చేసిన అంటరానితనం కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం, పెన్న పేరూరు గ్రామంలో చోటుచేసు కుందని, రాష్ట్ర వ్యాప్త నిరసనలు జరుగుతున్నా, చలనం లేని వారుగా అధికారులు ఉంటు న్నారని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు యం. డి. ఆనందబాబు పేర్కొన్నారు. మంగళ వారం కెవిపిఎస్ రాష్ట్ర ప్రతినిధి బృందం కడప జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను పరామర్శించి, ప్రభాకర్ భార్య జయమ్మ, కుమారుడు సునీల్, బంధువు పాలయ్యను కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో పాశవికమైన ఘటన జరిగి 5 రోజులైనా బాధితులకు ఎఫ్ఐఆర్ చేతికిచ్చి, నింది తున్ని అరెస్టు చేస్తాం, మీకు అండగా ఉంటామని చెప్పడంలో విఫలమ య్యారన్నారు. సిఐను ఎఫ్ఐఆర్ కాపీ అడిగితే బాధితున్ని వచ్చి తీసుకుని పొమ్మనడం దుర్మార్గమన్నారు. ప్రభాకర్‌పై నూనె పోసిన వెంకట సుబ్బారెడ్డిని మాత్రమే అరెస్ట్ చేస్తే సరిపోదని, నూనె పోయడానికి ముందే దళితుడైన కదిరి ప్రభాకర్‌ను కులం పేరుతో దూషించి, కట్టెతో కొట్టి, స్పృహ తప్పి పడిపోయేలాగా చేసి ఆ తర్వాత సలసల కాగే నూనెను పోస్తుండగా చూస్తూ ప్రోత్సహించిన కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేయా లన్నారు. ఎందుకిలా చేస్తున్నారని అడిగిన ప్రభాకర్ భార్య జయమ్మ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తీరును కేసులో నమోదు చేయాలన్నారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులు వీధి అరుగుపై కూడా కూర్చోవడానికి వీల్లేదు అంటూ హత్యాయత్నం చేసే స్థితికి దిగజారుతుంటే, వాటిని రూపు మాప కుండా పాలకులు, అధికారులు చోద్యం చూసున్నారా ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఐఆర్‌లో వివక్షత, హత్యాయత్నం, అత్యాచారం కేసులు నమోదు చేసి, బాధితుడైన కదిరి ప్రభాకర్ కుటుంబానికి రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న వీధి అరుగుపై ప్రభుత్వమే బాధ్యత తీసుకుని దళితులను కూర్చో బెట్టాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులందరిని కూడా కట్టి వివక్షత నిర్మూలించేలా ప్రతి ఘటన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కెవిపిఎస్ ప్రతినిధి బృందంలో కెవిపిఎస్ కడప జిల్లా నాయకులు రాజేంద్ర, నంద్యాల జిల్లా నాయకులు కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దాడులు ఆపాలి : సిపిఎం

బద్వేలు : దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పి. చాంద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో దళిత కులానికి చెందిన కదిరి ప్రభాకర్‌పై కాగుతున్న నూనె పోసి గాయపరిచిన గజ్జల వెంకటసుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కదిరి ప్రభాకర్ పక్క గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా నీరసపడి కళ్ళు తిరిగి సమ యంలో పెన్న పేరూరులో ఉన్న బండ పైన సేద తీరితే వేడి నూనె పోసి గాయపరచడం దారుణమన్నారు. అగ్రకుల అహంకారానికి పరాకాష్టని అన్నారు. భార తదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవ త్సరాలు అవుతున్నా అంటరానితనం సమస్య పోలేదని వారు అన్నారు. సమావేశంలో ఇ. రమణయ్య, పి. రవిచంద్ర పాల్గొన్నారు.

దళితులపై దాడులు హేయం

అట్లూరు : దళితులపై దాడులు హేయనీయమైన చర్య అని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఈ,రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్నపేరూరు గ్రామంలో దళిత కులానికి చెందిన కదిరి ప్రభాకరపై కాలే నూనె పోసి గాయపరిచిన గజ్జల వెంకటసుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని పేర్కొన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సమావేశంలో బద్వేల్ మండల వ్యవసాయ కార్మిక సంఘం పి రవిచంద్ర, సి.సుభద్ర, బి. స్వప్న పాల్గొన్నారు.



పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

వేతనాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న జిల్లాలోని ఉద్యోగులందరికీ రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి మునీర్ ఖాన్‌కు యుటియఫ్ కడప జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలోని మండల విద్యా వనరుల కేంద్రాలలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మే, జూన్‌కు సంబంధించిన రెండు నెలల వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదని పేర్కొన్నారు. దీనివల్ల చిరు ఉద్యోగులైన వీరు అనేక ఆర్థిక సమస్యలతో విలవిలలాడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష పథక సంచాలకులకు యుటియఫ్ చేసిన ప్రాతినిధ్యాల మేరకు బడ్జెట్‌ను విడుదల చేసిందని చెప్పారు. దీనికి అనుగుణంగా జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు ఉద్యోగులకు జీతాలను వెంటనే ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు సురేష్ కుమార్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జిపిఎస్ గెజిట్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిపిఎస్ అమలుపరిస్తూ ఇచ్చిన రాజపత్రాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం పట్ల యుటిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం కడప యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023, అక్టోబర్ నుంచి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిపిఎస్ అమలుపరుస్తూ విడుదల చేసిన రాజ పత్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలంటూ రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశామని, పోరాట ఫలితంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు రాజపత్రాన్ని ఉపసం హరిచుకుంటున్నట్లు తెలపడాన్ని యుటిఎఫ్ స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సి.వి. రమణ,ఏజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

కుష్టు రహిత జిల్లాగా మారుద్దాం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

కుష్టు రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. మంగళవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టు వ్యాధి గుర్తింపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను కుష్టురహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని, జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఇందులో భాగంగా ఆశా వర్కర్లు, వాలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గృహాల్లో ప్రతి ఒక్కరిని పరీక్షిస్తారన్నారు. ఎవరికైనా లక్షణాలు ఉంటే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెరుగైన చికిత్సకు రెఫర్ చేస్తారని పేర్కొన్నారు. మందులు 6 నెలలు లేదా సంవత్సరం పాటు ఉచితంగా ఇస్తారన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి వసతి గృహాల్లో ప్రతి విద్యార్థికీ ఎల్‌సిడిసి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. వైద్య పరీక్షలకు వచ్చే ఆశా వర్కర్లకు ప్రజల సహకరించాలని కోరారు. డయేరియా నిర్మూలనకు బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయరాదని, నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, నిద్రించే సమయంలో వాడాలని, చేతులను సోపుతో శుభ్రంగా కడుకోవాలని చెప్పారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం : ఆర్‌డిఒ



భూ ఆక్రమణపై స్థానికులతో మాట్లాడుతున్న బద్వేల్ ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అట్లూరు

మండలం నల్లాయపల్లె గ్రామ పొలంలో రోజురోజుకూ ఆక్రమణలు శృతి మించి పోతున్నాయని, ఇలాగే కొనసాగితే భూ ఆక్రమణ దారులపై పోలీసులు కేసులు నమోదు చేయించి కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేల్ ఆర్‌డిఒ ఎ. చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం నల్లయపల్లె గ్రామం పొలంలో ఆక్రమణకు గురైన భూములను ఆయన స్వయంగా స్థానిక రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరికైతే డికెటి పట్టా రికార్డులు సక్రమంగా ఉన్నాయో వారు మాత్రమే భూమి పండించుకుని అనుభవించేందుకు అర్హులన్నారు. ఇతరులు కానీ నకిలీ పట్టాల పేర్లతో ఆక్రమణలు చేస్తే చూస్తూ ఊరుకోమని, ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల్లో అమ్మకాలు, కొనుగోలు చెల్లవని, ఇలాంటి వాటిని ప్రభుత్వం అనుమతించదని చెప్పారు. నిజమైన పట్టాదారులు మాత్రమే పంటలు సాగు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆక్రమణకు గురైన భూములను వెంటనే రెవెన్యూ శాఖ తరపున ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి సర్వే చేస్తామని చెప్పారు. తద్వారా నిజమైన అర్హులను గుర్తించి న్యాయం చేస్తామని ఆయన వెల్లడించారు. భూ అక్రమణ ఎన్ని ఎకరాలలో జరిగిందో వాటిని గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు. ఆక్రమణదారులపై పోలీస్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐని ఆదేశించారు. పేదలకు జీవనోపాధిగా ప్రభుత్వం కల్పించిన భూములను పట్టాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆక్రమణదారులు ఎవరైనా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ప్రవేశించి ట్రాక్టర్లు, యంత్రాలతో చదును చేసి దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూస్తే దాని పర్యవసనాలు ఏంటో రెవెన్యూ శాఖ నుంచి చేసి చూపిస్తామని ఆయన ఆక్రమణదారులను హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దార్ ఎ. వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దార్ టి. రవిశంకర్, ఎస్ఐ ఎస్.ఎం.కె. రాజు. ఎంఆర్ఐ ఎస్. కరిముల్లా. మండల సర్వేయర్ వి. శ్రీనివాసన్, విర్ఒ కె .సుబ్బన్న, రెవెన్యూ, పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి : సిపిఎం



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

ప్రజాశక్తి -గోపవరం

ఆక్రమణదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకుని ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి డి. వెంకటేష్ డిమాండ్ చేశారు. బద్వేల్ మండలం సి కొత్తపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్లు 46 45 47 54 56 57లలో చాలా మంది కబ్జాదారులు ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని ముల్లతీగ నాటుకొని కబ్జా చేశారని పేర్కొన్నారు. మంగళవారం ఆక్రమిత భూముల్లో పేదలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.కొత్తపల్లి రెవెన్యూ పొలంలో వందలాదిమంది పేదలు పేదలు గతం ఇచ్చిన అనుబంధాలలో బేస్‌మట్టాలు, గుడిసెలు, రూములు కట్టుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కొందరు కబ్జా దారులు పేదల నుంచి స్థలాలు లాక్కొని కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. బాధితులు అధికారులకు విన్నవించిన్నా పట్టించుకోలేదని వాపోయారు. వెంటనే రెవెన్యూ అధికారులు కబ్జా దారుల నుంచి భూమని స్వాధీనం చేసుకుని పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే వందలాది పేదలను ఐక్యం చేసి కబ్జాగురైన భూమిలో ఎర్రజెండాలు పాతి తాము అర్హులకు ఇంటి స్థలాలు, భూములు ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ రూరల్ కమిటీ సభ్యులు జి. జయరాజు, ఎన్.ఓబులేష్, ఎన్. రాంబాబు, దుర్గమ్మ, మరియమ్మ, సునీత, పేదలు పాల్గొన్నారు.

ఎసిఎ అండర్-19 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

- ఆరు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ రాజారెడ్డి ఎస్‌సిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై 6 వికెట్ల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. ఎసిఎ అండర్ - 19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం కడపలోని వైఎస్ రాజారెడ్డి స్టేడియం, కెఒఆర్ఎం, కెఎస్ఆర్ క్రికెట్ మైదానాలలో ప్రారంభం అయ్యాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 37.1 ఓవర్లను ఎదుర్కొని 103 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని జి. మన్విత్ రెడ్డి 36 పరుగులు చేశాడు. కడప జట్టులోని బి. ప్రణవ్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. ధీరజ్ కుమార్‌రెడ్డి 3, ధర్మ సేనా రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 134 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు 23.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని గురు విగ్నేష్ 43 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని వెంకట్ లోకేష్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

71 పరుగుల తేడాతో విశాఖపట్నం విజయం

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో 71 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 71 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన నార్త్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తురుత బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. ఆ జట్టులోని జి. ఈశ్వర్ రిత్విక్ 94 పరుగులు చేశాడు. కాస్ ప్రసాద్ 54 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని జున్నారావు 2, సాయి సుజన్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 274 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని ఎన్. సుశాంత్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 166 బంతులను ఎదుర్కొని 16 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 121 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. విశాఖపట్నం జట్టులోని పి.డి. రచిత్ 2, యువన్ 2 వికెట్లు తీసుకున్నారు.

73 పరుగుల తేడాతో సెంట్రల్ జోన్ జట్టు విజయం

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కృష్ణ జట్టుపై 73 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 310 పరుగులు చేసింది. ఆ జట్టులోని కే.ఎల్. శ్రీనివాస్ 75, రేవంత్ నాగ కుమార్ 63 పరుగులు చేశారు. కృష్ణ జట్టులోని యశ్వంత్ 3, సాయి ప్రకాష్ 2, రాజేష్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 311 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కృష్ణ జట్టు 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టులోని కాజా మొహిద్దీన్ 121 పరుగులు (సెంచరీ) చేశాడు. సెంట్రల్ జట్టులోని ఆదిత్య 2, షేర్ షా 2 వికెట్లు తీసుకున్నారు.



తలపడుతున్న కడప, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్లు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-చెన్నూరు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టిడిపి మండల అధ్యక్షులు కల్లూరి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రం సిబ్బందితో డాక్టర్ సతీష్ కుమార్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు చిత్తశుద్ధితో మంచి వైద్యాన్ని అందించాలని పర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి డ్యూటీలు చేసేవారిపైన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ఇకమీదట అలాంటివి జరగకుండా చూసుకోవాలన్నారు. సిబ్బందికి కూడా ఏ అవసరమున్నా ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది మరియు టిడిపి నాయకులు ఇంది రెడ్డి శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, షబ్బీర్ హుస్సేన్, ఆకుల ప్రసాద్ బాబు, ఆటో బాబు, చెన్నయ్య, వార్డు మెంబర్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన బిసి సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి- కడప సిటీ : కలెక్టర్‌లో తోటి శివశంకర్‌ను బిసి సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘం సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు కలెక్టర్ సాను కూలముగా స్పందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బిసి సంక్షేమ సంఘ నాయకులు అధ్యక్షులు బత్తల లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకాని త్రివిక్రమ్, ట్రెజరర్ శ్రీనివాసులు, జిల్లా ముఖ్యసలహాదారులు సుంకేసుల ఖాదర్ బాషా, నగర అధ్యక్షులు నరసింహం, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ల గంగయ్య, జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ పెద్ద రంగయ్య, నగర కార్యదర్శి రమణ ఉన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలో వ్యవసాయానికి, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎఇ సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ శాఖ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పర్యటించి ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డం ఉన్నట్లయితే తొలగించి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ రాకుండా చూడాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం వస్తుండడంతో ఇళ్లలోకి కరెంటు పాస్ అయ్యే ప్రమాదముందని, వీటిని జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరాములు టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ నవీన్‌కుమార్, లైన్‌మెన్లు శివయ్య, లక్ష్మి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్ల విభాగంలో దస్తగిరికి వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్



యోగివేమన విశ్వ విద్యాలయం ఆంగ్ల శాఖ పరిశోధకులు బండిసుల దస్తగిరికి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ అంగ్ల విభాగం సహ ఆచార్యులు డాక్టర్ ఎన్. అంకన్న పర్యవేక్షణల ' అరుంధతి రాయ్'స్ సెలెక్టెడ్ వర్క్స్ : ఏ స్టడీ' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. దస్తగిరి రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించారు. పరిశోధకులు దస్తగిరి వీరపునాయనిపల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందిన వారు. డాక్టరేట్ పొందిన దస్తగిరిని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, అంగ్ల శాఖ ఆచార్యులు పి.పద్మ, జి.మెర్సీ విజేత, డాక్టర్ జయంత్ కశ్యప్, అధ్యాపకులు పి. చిట్టిబాబు, డాక్టర్ వై హరిబాబు, పరిశోధకులు, విద్యార్థులు, మిత్రులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : భారత ప్రభుత్వం, విద్యాశాఖ న్యూఢిల్లీ వారు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారని డిఇఒ అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదుకు ఈనెల 18న, దరఖాస్తుల సమర్పణకు ఈనెల 21 చివరి తేదీ అని తెలిపారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే ఎన్.వరదరాజుల రెడ్డి

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జాతీయ తేక్వాండో చాంపియన్ షిప్‌లో ప్రొద్దుటూరు విద్యార్థులు బంగారు, వెండి పతకాలను సాధించారు. వీరిని మంగళవారం ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి తన నివాసం రాధానగర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా కోచ్‌లు కమల్ సంతోష్, రాజేష్ పలు అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈనెల 12 నుండి14 వరకు హైదరాబాద్ కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ తేక్వాండో చాంపియన్ షిప్ ఆటల పోటీలు జరిగాయి. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏపీ ఎస్సీడీసీఎల్ బీసీ అధ్యక్షులు మురళీమోహన్ ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- మృతులు బావ, బావమర్దులు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్ : పట్టణంలోని వైఎస్ఆర్ సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని నేషనల్ హైవే పనులు చేస్తున్న క్యాంపర్ ఢీ కొట్టడంతో సింహాద్రిపురం మండలం బలపనూరుకు చెందిన మేకల రామ కృష్ణయ్య(55), లింగాల మండలం లోప ట్నూతలకు చెందిన చక్కకృష్ణయ్య(51) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి... చక్క కృష్ణయ్య రెండవ కుమారుడు అమరేశ్వర్ మంగళవారం ఉదయం పాముకాటుకు గురికావడంతో పులివెందుల పట్టణంలోని వైఎస్ఆర్ సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకెళ్లారు. చికిత్స నిమిత్తం అక్కడే అడ్మిట్ కావడంతో రాత్రి భోజనం తీసుకువెళ్లేందుకు వారిద్దరూ ద్విచక్ర వాహనంపై పులివెందుల పట్టణానికి వచ్చి భోజనం ఇచ్చారు. తిరిగి ఆసుపత్రికి వెళుతుండగా ఆస్పత్రి సమీపంలో కడప నుండి వస్తున్న క్యాంపర్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవారు. వీరిద్దరూ బావా,బామ్మర్దులు కావడంతో ఒకేసారి ఇద్దరు మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఈ సంఘటనపై విచారణ చేస్తున్నారు.



మృతి చెందిన కృష్ణయ్య, రామకృష్ణయ్య

ఇసుక ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అతి వేగంగా వెళ్లడంతో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ ప్రతాప్ మృతి చెందిన సంఘటన ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. ప్రొద్దుటూర మండల పరిధిలోని పెన్నా పరి వాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఎస్సిబి అధి కారుల దాడులు నిర్వహించారు. అధికారులను తప్పించుకునేందుకు ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ప్రతాప్ అతి వేగంగా వెళ్లడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవ ర్‌కు చాతిపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్‌ను ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సదరు డ్రైవర్ ట్రాక్టర్ లైట్లు ఆఫ్ చేసి పొలాల్లో అతివేగంతో వెళ్లడం వల్ల ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. పోలీసులు విచారిస్తున్నారు.



మృతి చెందిన ప్రతాప్

గంటల వ్యవధిలోనే హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నేతాజీ నగర్ 3వ లైన్‌లో నివాసముంటున్న గడ్డమీది బాలనాగమ్మ హత్యోదంతం పట్టణంలో సోమవారం సంచలనం సృష్టించింది. ఈ కేసును గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి డి.మురళీధర్ వన్‌టైన్ సిఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్‌ను అభినందించారు. అనంతరం డిఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ.. మృతురాలు భర్త గడ్డమీద రామయ్య ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు సికె దిన్నె మండలం ఊటుకూరు గ్రామానికి వెళ్లి నిందితుడు జయచంద్రుడిని అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కుటుంబ కలహాలు, మనస్పర్థలు నేపథ్యంలోనే బాలనాగమ్మను హత్యకు గురైనట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసిన ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్, హెడ్ కానిస్టేబుల్ జగన్ నాయక్, రహంతుల్లా, జగన్నాథ్‌రెడ్డి, తిరుపతయ్య, గంగాధర్, సూర్యుడు, రవీంద్ర నాయక్, హోంగార్డు రంజిత్‌రెడ్డి, చిన్న పెద్దన్నను డిఎస్‌పి డి.మురళీధర్ అభినందించి, రివార్డులకు సిఫారసు చేశారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి డి.మురళీధర్

అడవి జంతువులను వేటాడే వ్యక్తి ..

ప్రజాశక్తి - వేంపల్లె

అడవి జంతువులను వెంటాడే చిరంజీవి అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి, వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని వడ్డేపల్లికు చెందిన చిరంజీవి పెంపుడు కుక్కలతో అడవికి వెళ్లి అక్కడి జంతువులను వెంటాడి మాంసాన్ని విక్రయిస్తున్నాడని తెలిపారు. అడవిలో వెంటాడి చంపిన జంతువుల వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టినట్లు చెప్పారు. ఆ మేరకు జిల్లా అటవీ అధికారికి ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు చిరంజీవిని అరెస్టు చేసి లక్కిరెడ్డిపల్లె కోర్టులో హాజరుపరిచామన్నారు.

పులివెందుల చెన్నారెడ్డి కాలనీలో చోరీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ముద్దనూరు రోడ్డు చెన్నారెడ్డి కాలనీలో నివాసముంటున్న విశ్వనాథరెడ్డి అనే ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు.. సోమవారం పనుల నిమిత్తం విశ్వనాథరెడ్డి కడపకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయం చూసి పసిగట్టిన దొంగలు ఇంటి తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి 10తులాల బంగారు, నగదు తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బైకులు ఢీ : పాల వ్యాపారికి గాయాలు

ముద్దనూరు : స్థానిక అమ్మవారిశాల ఆలయం వద్ద ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో పాల వ్యాపారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన తుమ్మలూరు రోసిరెడ్డి పాల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం ముద్దనూరులో పాలు విక్రయించేందుకు బైకులో వస్తుండగా జమ్మలమడుగు బస్టాండ్ అమ్మవారిశాల వద్ద ఎదురుగా మరో బైకు ఢీ కొంది. ప్రమాదంలో రోసిరెడ్డికి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పూడిక, పిచ్చిమొక్కలతో కెసి కాలువ

చివరి ఆయకట్టుకు నీరు చేరేదెలా? - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - చాపాడు

జిల్లాలోనే అధికంగా వ్యవసాయానికి సాగునీరు అందించే కెసి కాలువ ఆయకట్టు జిల్లాలో దాదాపు 92 వేల ఎకరాలు ఉంది. ఈ నేపథ్యంలో కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో వ్యవసాయానికి నీరు అందడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కర్నూలు జిల్లా చాగలమర్రి మండల పరిధిలో రాజోలి ఆనకట్ట వద్ద నుండి జిల్లాలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరు, రాజుపాలెంతోపాటు చెన్నూరు, కడప మండలాల్లో కెసి కాలువకు ఆయకట్టు ఉంది. అయితే కెసి కాలువ వెంబడి కంపచెట్లు విపరీతంగా పెరిగి కాలువ బలహీనపడుతుంది. అలాగే కొన్ని ప్రదేశాల్లో సిమెంట్ లైనింగ్‌లు దెబ్బతిని కాలువ కోతకు గురవుతోంది. కెసి కాలువలో పూడికతీత పనులను ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నా.. ఎక్కువ ప్రాంతాల్లో పూడికతీత సమస్య కనిపిస్తోంది. ఏటూరు కాలువలో ఉపాధి పనులు చేపట్టారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మాత్రం పూడిక సమస్య ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం సెట్టర్లు లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. మైదుకూరు నుంచి కొండపేట కాలువలో ఆకులు, అలములు అధికంగా ఉండడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా మారింది. పట్టణ పరిధిలో ఉన్న కాలువల్లో వ్యర్థ పదార్థాలు వేస్తుండడంతో రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. చాపాడు ఛానల్ ద్వారా చివరి ఆయకట్టుకు కాలువల్లో వ్యర్థ పదార్థాలు, లైనింగ్ పనులు దెబ్బతినడంతో నీటి ప్రవాహం సజావుగా సాగడం లేదు. కెసి కెనాల్ కాలువలను పరిరక్షించే సిబ్బంది కొరత ఎక్కువగా ఉండడంతో అక్రమ నీటి వాడకం, నీటి వృథా అవుతోంది. ఆగస్టు నెలలో కెసి కాలువకు నీరు విడుదలైతే రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కెసి కాలువలో అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గాంధీనగర్ వద్ద కెసి కాలువలో ఏపుగా పెరిగిన గడ్డి, కంపచెట్లు

ఫుడ్ టెక్నాలజీ డిగ్రీతో ఉద్యోగావకాశాలు మెండు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ చేయడం వల్ల అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని పులివెందుల కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ టెక్నాలజీ కోర్స్‌లో చేరుటకు దరఖాస్తులు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా బైపిసి ఫార్మర్స్ కోటా, నాన్ ఫార్మర్స్ కోటా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఆగష్టు 2వ తేదీ వరకు, లేట్ ఫీజుతో ఆగష్టు 12వ తేదీ వరకు స్వీకరిస్తారని తెలిపారు. ఎంపిసి విద్యార్థులకు ఫార్మర్స్ కోటాలో దరఖాస్తు చేసేవారు ఈ నెల 29వ తేదీ వరకు ఆఫ్‌లైన్‌గా స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులు వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ (ఏఎన్‌జిఆర్‌యు.ఏసీ.ఇన్) నుంచి పొందవచ్చని, ఏపీ-ఈఏపిసిఈటిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ కళాశాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ ఫుడ్ టెక్నాలజీ కోర్స్ అభ్యసించిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని వివరించారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఈ కోర్స్ అభ్యసించిన విద్యార్థులకు మెండుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మంచి జీతాలతోపాటు సుస్థిరమైన జీవితం లభిస్తుందని తెలిపారు. ఫుడ్ ప్రాసె సింగ్ యూనిట్లలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లు, ప్రభుత్వ రంగంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, పేటెంట్ ఆఫీసర్లు, ఇతర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా సొంతంగా పరిశ్రమలు ప్రారంభించవచ్చని తెలిపారు. చదువు పూర్తయ్యాక దేశవిదేశాల్లో ఎందరో తమ కళాశాల విద్యార్థులు అధ్యాపకులుగా, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో వివిధ శాఖల్లో స్థిరపడుతున్నారని చెప్పారు. పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్స్ అందుబాటులో ఉందన్నారు. తమ కళాశాలలో పూర్తిస్థాయి ఆధునిక ప్రయోగశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్య పూర్తి చేసిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విశ్వ విద్యాలయాల్లో ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారని అన్నారు. మల్టీనేషనల్ కంపెనీలలో మంచి జీతంతో ఉద్యోగాలు సంపాదించారని తెలిపారు. ఫుడ్ టెక్నాలజీ డిగ్రీ అడ్మిషన్‌కు సంబంధించి అన్ని రకాల వివరాలు, అప్డేట్స్ తెలుసుకొనుటకు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను తరుచుగా చూస్తూండాలని సూచించారు. వివరాలకు పులివెందుల కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ నెంబర్ 91777 76692ను నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

కడప-రేణిగుంట రహదారి పనులు ప్రారంభించాలి : పిసిసి



తులసిరెడ్డిని సత్కరిస్తున్న సలావుద్దీన్

ప్రజాశక్తి - వేంపల్లె

కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులను త్వరగా మొదలు పెట్టాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని సంఘ సేవకుడు, కాంగ్రెస్ నాయకుడు సలావుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువతో సత్కరించారు. కడప నగరంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతపై చర్చించారు. అనంతరం తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కడప-రేణిగుంట రహదారి అతి ప్రధానమైందన్నారు. నిరంతరం రద్దీగా ఉంటుందన్నారు. తూర్పున చెన్నై, పడమర ముంబై వంటి మహా నగరాలను కలిపే రహదారి అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.2,254 కోట్లతో 122 కిలోమీటర్ల పొడవుగల 4 వరుసల రోడ్డును మంజూరు చేసిందని తెలిపారు. 2023 అక్టోబర్‌లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. లక్ష్మీ ఇన్ఫ్ర సంస్థ టెండర్లు దక్కించుకుందన్నారు. ఇంకా పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హమన్నారు. 100 హెక్టార్ల అటవీ భూమికి సంబంధించి అను మతిరాని కారణంగా పనులు మొదలు పెట్టలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని అటవీ అను మతులు తెప్పించి త్వరగా పనులు మొదలు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిం దని, కార్పొరేషన్లుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల. సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని తులసిరెడ్డి కోరారు.

జోరుగా జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు



పోటాపోటీగా తలపడుతున్న బాలికలు

పజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో ఈనెల 10 నుంచి జరుగుతున్న సౌత్ జోన్ హాకీ ఛాంపియన్‌షిప్ జూనియర్ బాలుర, బాలికల పోటీలు జోరుగా సాగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం జరిగిన హాకీ పోటీల వివరాలు.. బాలికల విభాగానికి సంబంధించి కర్ణాటక జట్టు, కేరళ జట్టుపై 5 గోల్స్ వేసి విజయం సాధించింది. తెలంగాణ జట్టు, పాండిచ్చేరి జట్టుపై 2 గోల్స్ వేసి విజయం సాధించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ జట్టు, తమిళనాడు జట్టుపై 6 గోల్స్ వేసి విజయం సాధించింది. పురుషుల విభాగానికి సంబంధించి తెలంగాణ జట్టు, పాండిచ్చేరి జట్టుపై 4 గోల్స్ వేసి విజయం సాధించింది. కర్ణాటక జట్టు, కేరళ జట్టుపై 6 గోల్స్ వేసి విజయం సాధించింది. తమిళనాడు జట్టు, ఆంధ్రప్రదేశ్ జట్టుపై 3 గోల్స్ వేసి విజయం సాధించిందని టోర్నమెంట్ ఆర్గనైజర్ కార్యదర్శి చాణిక్య రాజ్ తెలిపారు.

తమిళనాడు జట్టు క్రీడాకారుడు అరుణ్‌కు అవార్డు

పులివెందులలో జరుగుతున్న జూనియర్ బాలురు, బాలికల సౌత్‌జోన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024 విభాగంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు జట్లు తలపడగా.. తమిళ నాడు పురుషుల జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుపై 3 గోల్స్ వేసి విజయం సాధించింది. విజయం సాధించిన తమిళనాడు జట్టులోని అరుణ్‌కు ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిరుమలశెట్టి రవికుమార్ అవార్డు ప్రదానం చేశారు.



అరుణ్‌కు అవార్డు అందిస్తున్న రవి

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

ప్రొద్దుటూరు : ప్లాస్టిక్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగిస్తుందని, ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి కోరారు. స్థానిక కోనేటి కాల్వ వీధిలో ప్లాస్టిక్ అమ్ముతున్న అంగళ్లపై మంగళవారం దాడి చేశారు. దాదాపు 200 కిలోల సూపర్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ హాండిల్ కవర్లు, 100 ప్యాకెట్ల గ్లాసులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలన్నారు. దాడిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఘనంగా మొహరం వేడుకలు

ముద్దనూరు : మొహరం పర్వదినం సందర్భంగా మంగళవారం మండలంలోని ము స్లింలు వేడుకలు ఘ నంగా నిర్వహిం చారు. స్థానిక రైల్వే గేటు వద్ద ఉన్న పీర్ల చావిడి, డిఎన్ పల్లె, మండలంలోని మంగపట్నం, ఉప్పలూరు గ్రామా ల్లోని పీర్ల చావిడి నుంచి పీర్లు ఊరేగింపు చేశారు. స్థానిక రైల్వే గేటు వద్ద ఉన్న పీర్ల చావిడిలో ఎస్ఐ మైనుద్దీన్, మండల యువ నాయకులు కటికరెడ్డి గుణ వంతరెడ్డి స్వామి వారికి చదివింపులు అందజేశారు. కమిటీ సభ్యులు అబ్దుల్ ఖాదర్, జిందా బా షా (షే వ ు న్ బ్రదర్స్) ఇంటి వద్ద నుంచి స్వామి వారికి చదివింపులు (పాల షరబతు పూల షెహారాలు)తీసుకుని మెయిన్ బజారు నుంచి పీర్ల చావిడి వరకు ఘనంగా ఊరేగించారు. రాత్రి గుండం ఏర్పాటు చేశారు.

సాగుకు సాయం అందించాలి

మైదుకూరు : చంద్రబాబు ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలు సాగుకు సాయం అందించాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. స్థానిక వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్నకు మంగళవారం వారు వినతి పత్రం అందజేశారు. ఖరీఫ్ ప్రారంభమైన సందర్భంగా కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, కల్తీ పురుగులు మందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్ సునీతరెడ్డి

నారాయణ పాఠశాలలో కేబినెట్ ఎలక్షన్స్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నారాయణ పాఠశాలలో విద్యార్థులకు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, జూనియర్ హెడ్ బాయ్, జూనియర్ హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, నాగ్, త్రిసూల్, పృథ్వీ, అగ్ని గ్రూప్ లీడర్స్‌కు సంబంధించిన కేబినెట్ ఎలెక్షన్స్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అభ్యర్థి విద్యార్థులు తమకు కేటాయించిన గుర్తుతో పాఠశాలలో ఉన్న ప్రతి క్లాసు రూమ్స్ వెళ్లి విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను కూడా తమకు ఓటు వేయాలని గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం ఓటు వేసే విధానాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎజిఎం చెన్నకేసవ రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎలెక్షన్స్ అంటే ఏమిటీ, వాటి ఉపయోగం, విధి విధానాలు, ఓటు హక్కుఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై నారాయణ యాజమాన్యం అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఇలా చేయడం వల్ల విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం ఏర్పడుతుందని వివరించారు. ప్రిన్సిపల్ ఎల్.సునీతారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎలెక్షన్స్ సిబ్బందిగా ఉపాధ్యాయులు ఎన్నికలను సజావుగా నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వారి కేటగిరి సంబంధించిన బ్యాడ్జ్ ప్రదానం చేశారు.

ఎపిఆర్ సెట్‌లో వేంపల్లె వాసికి 2వ ర్యాంకు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెకు చెందిన కదిరి సాయిసతీష్ ఎపిఆర్ సెట్‌లో రెండవ ర్యాంకు సాధించాడు. 2023-24కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ టెస్టులో 135 మార్కులు సాధించి రెండవ ర్యాంకు పొందినట్లు సాయిసతీష్ తండ్రి చంద్రశేఖర్ తెలిపారు. సాయిసతీష్ ప్రొద్దుటూరులోని వైఎస్ఆర్ వైవియూలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



సాయిసతీష్

మలేరియాపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా మలేరియా అధికారి మనోరమ

ప్రజాశక్తి - వేంపల్లె

మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుంటే, వ్యాధి నివారణ సాధ్యమని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె సిబ్బందికి మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోరమ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్‌గన్యా, బోధకాలు, ఫైలేరియా, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు. గ్రామాల్లోని ప్రజలకు వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, జిల్లా మలేరియా ఎంపిహెచ్ ఇఒ శంకరరెడ్డి, సిహెచ్ఒ వెంకటరత్నం, ఎంపిహెచ్ఇఒ బాబా ఫకృద్దీన్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

19న డివైఎఫ్ఐ జిల్లా వర్క్ షాప్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : డివైఎఫ్ఐ జిల్లా వర్క్ షాప్ ఈ నెల 19న బద్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. మంగళవారం ఆయన కరపత్రాలు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో జరిగే వర్క్ షాప్‌నకు జిల్లా నలుమూలల నుండి డివైఎఫ్ఐ నాయకత్వం హాజరవుతారన్నారు. ముఖ్యంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాల ఇచ్చిన హామీల అమలుపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ కేంద్రం ఇవ్వడంలో తీవ్ర జాప్యం వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరు తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, ప్రొద్దుటూరు నాయకులు విశ్వనాథ్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

మడూరు రోడ్డులో కంపచెట్ల తొలగింపు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మడూరు, అన్నవరం ఆర్అండ్‌బి రోడ్డు వెంబడి కంపచెట్ల తొలగింపును అధికారులు చేపట్టారు. గత వారంలో చాపాడు మండల సర్వసభ్య సమావేశంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి రోడ్డు వెంబడి కంపచెట్లతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ అధికారులను అప్రమత్తం చేసి రోడ్డు వెంబడి ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించే ఏర్పాటు చేశారు. అన్నవరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేసిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు ధన్యవాదాలు తెలి పారు. కంపచెట్ల తొల గింపుతో ప్రయాణికులకు ఇక్కట్లు తొలిగిపోయాయి.



అన్నవరం వద్ద కంపచెట్లు తొలగిస్తున్న జెసిబి యంత్రం